# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 30-11-2025 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- భూమాతను రక్షించడానికి ప్రకృతి వ్యవసాయం చేయడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
- పోలీసుల పట్ల ప్రజల దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి తెలిపారు.
- పార్లమెంటు శీతాకాల సమావేశాలు నిర్మాణాత్మకంగా జరిగేందుకు సహకరించాలని రాజకీయ పార్టీలను కోరామని కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు తెలియజేశారు.
- ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ గడువును మరో ఏడు రోజులు పొడిగిస్తూ.. భారత ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది.
- రాంచి వేదికగా భారత్ తో జరుగుతున్న మొదటి వన్డేలో 350 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా.

===================

ప్రస్తుతం యువ నిపుణులు ప్రకృతి వ్యవసాయం రంగంలోకి అడుగుపెడుతున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ప్రకృతి వ్యవసాయం భారతదేశ ప్రాచీన సంస్కృతిలో భాగమని, భూమాతను రక్షించడానికి ప్రజలు నిరంతరం దీనిని ప్రోత్సహించడం తమ కర్తవ్యమని ప్రధాని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా పంచుకునే “మన్ కీ బాత్ మనసులోని మాట” 128 సంచికలో ఈ అంశాలను పంచుకున్నారు. వ్యవసాయ రంగంలో భారత్ ఒక ముఖ్యమైన మైలురాయిని చేరుకుందని, 35.7 కోట్ల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తితో దేశం రికార్డు సృష్టించిందని తెలిపారు. పదేళ్ల క్రితంతో పోలిస్తే, ఆహార ధాన్యాల ఉత్పత్తి సుమారు 10 కోట్ల టన్నులు పెరిగిందని ప్రధాని స్పష్టం చేస్తూ..

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = =

శీతాకాల పర్యాటకానికి అవసరమైన పర్వతాలు, సంస్కృతి, సాహస అవకాశాలు భారతదేశంలో పుష్కలంగా ఉన్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈ రోజు జరిగిన 'మన్ కీ బాత్.. మనసులోని మాట' 128 సంచికలో భారతదేశం కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇస్తున్నట్లు కొద్దిరోజుల కిందటే ప్రకటించిన విషయాన్ని కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు. భారత నౌకాదళం వేగంగా ఆత్మనిర్భరత దిశగా పయనిస్తుండటం పట్ల ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. డిసెంబర్ 4వ తేదీన నౌకాదళ దినోత్సవాన్ని జరుపుకోవడం గురించి మాట్లాడుతూ... సైనిక చరిత్రపై ఆసక్తి ఉన్నవారికి దేశంలో అనేక అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, ఈ కేంద్రాలను సందర్శించడం ద్వారా ప్రజలు ఎంతో నేర్చుకోవచ్చని అన్నారు.

= = = = = = = = = = = = = = = = = = =

పార్లమెంట్ శీతాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో, సమావేశాలకు ముందు కేంద్ర ప్రభుత్వం ఈరోజు అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించింది. పార్లమెంట్ హౌస్ అనెక్స్‌లో జరిగిన ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షత వహించారు. అఖిలపక్ష సమావేశం అనంతరం పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెణ్ రిజిజు మీడియాతో మాట్లాడారు. ఈ సమావేశం సానుకూల వాతావరణంలో జరిగిందని తెలిపారు. ఉభయ సభల కార్యకలాపాలు సాఫీగా, నిర్మాణాత్మకంగా జరిగేందుకు శీతాకాల సమావేశాల్లో సహకరించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరామని వెల్లడించారు. శీతాకాల సమావేశాలు రేపటి నుంచి ప్రారంభమై డిసెంబర్ 19వ తేదీ వరకు కొనసాగుతాయని కిరెణ్ రిజిజు పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని 12 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (SIR) కార్యక్రమం షెడ్యూల్‌ను భారత ఎన్నికల సంఘం (ECI) సవరించింది. ఈ గడువును మరో ఏడు రోజులు పొడిగిస్తూ.. ఈసీఐ నిర్ణయం తీసుకొంది. సవరించిన షెడ్యూల్ ప్రకారం, ఓటర్ల నమోదు (ఎన్యూమరేషన్) ప్రక్రియ గడువును డిసెంబర్ 11 వరకు పొడిగించారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ డిసెంబర్ 16న, తుది ఓటర్ల జాబితా ప్రచురణ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న చేపట్టనున్నారు. ప్రస్తుతం ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమం ఉత్తరప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, ఛత్తీస్‌గఢ్, గోవా, గుజరాత్, కేరళ, లక్షద్వీప్, మధ్యప్రదేశ్, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలలో కొనసాగుతోంది.

= = = = = = = = = = = = = = = = = = =

పోలీసుల పట్ల ప్రజల దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. వృత్తి నైపుణ్యం, సున్నితత్వం, వేగవంతమైన స్పందన సామర్థ్యాన్ని మెరుగుపరచడం ద్వారా ఈ మార్పు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. రాయ్‌పూర్‌లో ఈ రోజు 60వ అఖిల భారత డైరెక్టర్ జనరల్స్, ఇన్‌స్పెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ సదస్సులో ప్రధానమంత్రి మాట్లాడారు. పట్టణ ప్రాంత పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని, పర్యాటక పోలీసుల వ్యవస్థను పునరుద్ధరించాలని, కొత్తగా అమల్లోకి వచ్చిన నేర చట్టాలపై ప్రజలకు అవగాహన కలిగించాలని నరేంద్ర మోదీ సూచించారు. నిషేధిత సంస్థల కార్యకలాపాలను క్రమం తప్పకుండా పర్యవేక్షించే యంత్రాంగాలను ఏర్పాటు చేయాల్సిన ప్రాముఖ్యతను ప్రధాని పునరుద్ఘాటించారు.

= = = = = = = = = = = = = = = = = = =

నైరుతి బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన `దిత్వా` తుఫాను ఉత్తర తమిళనాడు, పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా ఉత్తరం వైపుగా పయనించే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) వెల్లడించింది. రాగల 24 గంటల్లో ఈ తుఫాను ఇదే దిశగా పయనిస్తుందని పేర్కొంది. దీని ప్రభావంతో తమిళనాడు, కోస్తా ఆంధ్రప్రదేశ్ లో పలు ప్రాంతాలలో రేపటి వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ హెచ్చరించింది. శ్రీలంక, తమిళనాడు, పుదుచ్చేరి తీర ప్రాంతాలు, అలాగే దక్షిణ ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతాల మత్స్యకారులు రేపటి వరకు వేటకు వెళ్లవద్దని వాతావరణ శాస్త్రవేత్త అమిత్ భరద్వాజ్ సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = =

ఝార్ఖండ్‌లోని రాంచి వేదికగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి వన్డే క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా జట్టు బౌలింగ్ ఎంచుకోగా.. భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 349 పరుగులు చేసింది. 350 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన దక్షిణాఫ్రికా కడపటి వార్తలు అందేసమయానికి 31 ఓవర్లలో 5 వికెట్ల కోల్పోయి 216 పరుగులు చేసింది. భారత బ్యాటర్లలో విరాట్ కోహ్లి 135, రోహిత్ శర్మ 57 కేఎల్ రాహుల్ 60 పరుగులు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = =